

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## మంత్రి కెటిఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి డిసెంబర్1,ప్రభాతవార్త :**
ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మంత్రి కెటిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కల్వకుర్తి నియోజకవర్గంలో అత్యంత ప్రాతిపదికన మూడు బిటి రోడ్లు ( వెల్దండ- తిమ్మనోనిపల్లి, బైరాపూర్- అజిల్లాపూర్, తలకొండపల్లి -వీరన్నపల్లి ) కావాలని వినతి పత్రం అందజేసి కోరారు. ఈ సందర్భంగా వెంటనే స్పందించి సంబంధిత శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో మాట్లాడి పనులు మంజూరు చేయమని చెప్పారు.అదే విధంగా ఈ మూడు బిటి రోడ్లతో పాటు ఇటీవల బిటి రోడ్ల పునరుద్ధరణను కూడా త్వరగా చేయించాలని కోరారు.

# నర్సరీల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

**-అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ**





**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
నర్సరీల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించి,హరితహారంకు అవసరమైన నాణ్యమైన మొక్కలు అందించేందుకు సంబంధిత అధికారులు అందరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో హరితహారం నర్సరీల నిర్వహణ,పల్లె ప్రకృతి వనాలు,తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల పనుల పురోగతిపై మండలాల వారీగా డిఆర్డఇఒ కృష్ణన్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈసారి హరిత హారంకు అవసరమైన మొక్కలను అందించేందుకు ప్రతి గ్రామపంచాయతీలో నర్సరీల నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని అన్నారు. అవసరమైన నాణ్యమైన విత్తనాలను స్థానికంగా సేకరించి విత్తాలన్నారు.విత్తిన విత్తనాలతో వంద శాతం మొక్కలు మొలకెత్తేలా చూడాలన్నారు.మంచి రకం ప్లాస్టిక్ బ్యాగ్‌లను వినియోగించి అందులో ఎర్ర,నల్ల మట్టి మిక్స్ చేసి ఈనెల 5వరకు బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పూర్తి చేసి 15 వరకు విత్తనాలను విత్తాలన్నారు.గ్రామ పంచాయతీలలో నర్సరీల వారిగా ఎస్టిమేషన్ జెనరేషన్ పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు.నర్సరీలలో వన సేవకులుగా మహిళలను నియమించాలని తెలిపారు.ఈ సారి నర్సరీలలో మునగ, కరివేపాకు మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని,ఇట్టి మొక్కలను పాఠశాలల్లో ఎక్కువ నాటాలని సూచించారు.ప్రతి నర్సరీలో కనీసం 500మునగ మొక్కలు పెంచాలన్నారు. నర్సరీలన్నింటిని ప్రభుత్వ భూములలో ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు,పల్లె ప్రకృతి వనాలకు అవసరమైన స్థల సేకరణ పనులను పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి సారించాలని అన్నారు.స్థల సేకరణకు ఎంపిడిఓలు,తహసీల్దార్ల సహకారంతో ఈనెల 20వరకు అన్ని గ్రామ పంచాయతీలలో క్రీడా ప్రాంగణాలు ,పల్లె ప్రకృతి వనాల కోసం స్థల సేకరణ పనులను పూర్తి చేయాలని సూచించారు.క్రీడా ప్రాంగణాలు,పల్లె ప్రకృతి వనాలు,బృహత్ పల్లె ప్రకృతి వనాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నందున పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో ఎంపిడివోలు, ఎంపివోలు, ఏపిఓలు,ఇసిలు,తదితరులు పాల్గొన్నారు.

## లేక్ పోలిసింగ్ విధులు హర్షణీయం

**- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర**

**- యువతిని కాపాడిన పోలీసులను అభినందించిన సీపీ**



యువతిని కాపాడిన పోలీస్ సిబ్బందిని అభినందిస్తున్న సీపీ

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 1, (ప్రభాతవార్త) :**
సైబరాబాద్ పరిధిలోని మాధాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ పై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ యువతిని కాపాడిన మాదాపూర్ లేక్ పోలీసులను గురువారం కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర అభినందించి రివార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువతిని కాపాడేందుకు ధైర్యసాహసాలు కనబర్చిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులోనూ ఎవరైనా ఆత్మహత్యలకు పాల్పడితే వారి ప్రాణాలను కాపాడాలన్నారు. మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సీఐ భాను ప్రకాష్, దుర్గం చెరువు లేక్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ నవీన్‌కుమార్, తెలంగాణ టూరిజం డిపార్ట్‌మెంట్‌కు చెందిన బోర్డ్ డ్రైవర్ ఎస్.మనోహర్, హైదరాబాద్ యాచ్ క్లబ్‌కు చెందిన సెయిలింగ్ కోచ్ రజినీకాంత్‌లను సీపీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను అందజేశారు.

**పోలీసులు కాపాడిన యువతి కేసు వివరాలు...**

నవంబర్ 29న సాయంత్రం 6 గంటల సమయంలో మెహదీపట్నం రేతిబోలి ప్రాంతానికి చెందిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న కుమారి హర్షిత (19) అనే యువతి మానసిక ఒత్తిడి గురై ఆకస్మాత్తుగా వంతెన మీద నుంచి చెరువులోకి దూకి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. అదే సమయంలో బ్రిడ్జ్‌పై పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న లేక్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నవీన్ కుమార్ వెంటనే అప్రమత్తమై దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి కింద ఉన్న లేక్ పోలీసులను అప్రమత్తం చేశారు. మాధాపూర్ సీఐ భాను ప్రకాష్, తెలంగాణ టూరిజం డిపార్ట్‌మెంట్‌కు చెందిన బోట్ డ్రైవర్ మనోహర్, హైదరాబాద్ యాచ్ క్లబ్‌కు చెందిన రజనీకాంత్‌తోబ్ కలిసి ఆ యువతిని రక్షించి సీపీఆర్ చేసి దగ్గర్లో ఉన్న హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం అమ్మాయి పరిస్థితి నిలకడగా ఉందని తెలుసుకున్న పోలీసులు ఆమె తల్లిదండ్రులను పిలిచి వారి సమక్షంలో కౌన్సిలింగ్ చేసి ఇంటికి పంపించారు.

# ఎరక్కపోయి..ఇరుకున్నాడు...

**-గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కిన పాత నేరస్తుడు..**
**-విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ కోటిరెడ్డి**





విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

**వికారాబాద్, డిసెంబర్ 01, ప్రభాతవార్త:**
రెండు హత్య కేసుల్లో పరారీలో ఉన్న నింధితుడు గంజాయి అమ్ముతూ వికారాబాద్ పోలీసులకు చిక్కాడు. నింధితుడు పట్టుబడ్డ సంఘటన యోచిస్తే మాత్రం ఎరక్కపోయి..ఇరుకున్నాడనే నానుడి గుర్తుకు వస్తుంది. ఈ విషయమై గురువారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డి వికారాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గురువారం ఉదయం వికారాబాద్ టౌన్ ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందితో కలిసి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఎన్నెపల్లికి చెందిన ఎండి.సల్మాన్ గంజాయి అమ్ముతూ పట్టుబడ్డాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా, 2019 డిసెంబర్ నెలలో కల్యాణ్ బాబు అనే వ్యక్తి తన ప్రియురాలితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అక్కసుతో శివారెడ్డిపేట్ శివారులో కల్యాణ్ బాబు ు బావిలో తోసివేసి హత్య చేశాడు. అప్పుడు వికారాబాద్ పోలీసులు కల్యాణ్ బాబు యొక్క శవాన్ని బావిలో గుర్తించి ఎలాంటి ఆధారాలు లేనందున గుర్తు తెలియని శవముగా భావించి కేసు నమోదు చేశారు. అదేవిధంగా 2021 సంవత్సరంలో బతుకుదెరువు నిమిత్తం వికారాబాద్‌కు వచ్చిన నేపాల్ కు చెందిన సురేశ్ అనే వ్యక్తి గంజాయి వ్యాపారం విషయంలో మోసం చేశాడని భావించి, మద్దులగడ్డ తండా ప్రక్కన గల ఒక చిన్న గుట్ట పైన ఇ ుప రాడ్‌తో సురేశ్ తలపై కొట్టి హత్య చేశాడు. కల్యాణ్ బాబు, సురేశ్ లు హత్య చేసి తప్పించుకొని తిరిగే క్రమంలో కొన్ని రోజుల పాటు హైదరాబాదులో ని బేగంపేట్ లో సల్మాన్ కొన్ని రోజుల పాటు సల్మాన్ చికెన్ సెంటర్ లో పని చేసేవాడు. ఆ క్రమంలో అక్కడ ఒక అమ్మాయిని వెంబడించి వేధించిన విషయం లో సల్మాన్‌పై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో అక్కడి నుండి తప్పించుకొని వివిధ ప్రదేశాల్లో తిరుగుతూ గంజాయి అమ్ముతు గురువారం వికారాబాద్ లో పట్టుబడ్డాడు, వికారాబాద్ పోలీసులు నింధితుడు సల్మాన్‌ను విచారించగ పై రెండు హత్య కేసుల ు తానే చేశానని, బేగంపేటలో తనపై కేసు నమోదు చేశారని నింధితుడు ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసు ఛేదించిన ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందిని జిల్లా ఎస్పి అభినందించి రివార్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 480 గంజాయి చాక్లెట్లు లభ్యం

**- గంజాయి చాక్లెట్లను అమ్ముతున్న నలుగురు అరెస్టు**

**- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ సీఐ రామకృష్ణ**

**షాద్‌నగర్, డిసెంబర్ 1, (ప్రభాతవార్త) :**
గంజాయ్ చాక్లెట్లు అమ్ముతున్న నలుగురు ముఠాను షాద్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు షాద్‌నగర్ ఎక్సైజ్ సీఐ డి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణలోని నాగులపల్లి రైతు కాలనీలోని మెయిన్ రోడ్డులో గల ఓ కిరాణా షాపులో గంజజాయి చాక్లెట్లు అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు రాత్రి చాకచక్యంగా అరెస్టు చేశారు. 480 గంజాయి చాక్లెట్స్ ప్యాకెట్లను స్వాధీన పరుచుకోని వారిని విచారించారు. ఈ విచారణలో భాగంగా నందిగామ వద్ద అయ్యప్ప దేవాలయం కిరాణం షాపులో 40 గంజాయి చాక్లెట్స్ ఉన్నాయన్న సమాచారం తెలుసుకొని వాటిని కూడా స్వాధీనపరుచుకున్నారు. కాటేదాన్ నుంచి ఈ గంజాయి చాక్లెట్ల రవాణా అవుతున్నట్లు ఆయన తెలిపారు. కాటేదాన్‌కు చెందిన వ్యక్తితో పాటు షాద్‌నగర్‌లో మరికొందరిని అదుపులో తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిందితులు సుశీల్, శశికాంత్, జలంధర్, అజయ్‌కుమార్ నలుగురిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ పోలీసులు స్పష్టం చేశారు.



నిందితులను మీడియాకు చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు.

## నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**-అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి మల్లారెడ్డి**

**-పాల్గొన్న చైర్మన్ చంద్రారెడ్డి, కౌన్సిలర్లు**



**నాగారం డిసెంబర్1,ప్రభాతవార్త :**
నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు.మున్సిపల్ అభివృద్ధికి హెచ్ఎండిఏ నిధుల నుండి 20వ.వార్డులో వర్షం నీరు నిలవకుండా 8 కోట్లు,16వ.వార్డు అభివృద్ధికి 1.30 కోట్లు,18.19 వార్డులో సిసి రోడ్డు పనులకు 50లక్షలు రూపాయలతో పనులకు చైర్మన్ చంద్రారెడ్డితో కలిసి మంత్రి మల్లారెడ్డి శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి,వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్,కమిషనర్ వాణి రెడ్డి,కౌన్సిలర్లు అనంత రెడ్డి,బిజ్జా శ్రీనివాస్ గౌడ్,పంగ హరిబాబు,సుర్వి శ్రీనివాస్ గౌడ్,బి.శ్రీనివాస్ ,అన్నం రాజు లావణ్య శ్రీనివాస్,గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్,మోకు రేణుక జగన్మోహన్ రెడ్డి, కొమరెల్లి అనితా సుధాకర్ రెడ్డి,అన్నం రాజు సుమిత్ర సురే ష్,మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్,డిఈ రఘు,హెచ్ఎండిఏ ఎఈ వెంకన్న,కో ఆప్షన్ సభ్యులు ఆదాం షఫీ,జలాల్ పాషా బాయ్,పట్టణ పార్టీ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్,వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్,గండి అంజయ్య గౌడ్,జూలకంటి రమేష్ గుప్తా,యువ నాయకుడు కౌకుట్ల రాహుల్ రెడ్డి,వామన్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు,మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య కార్యాలయం నుండి డైట్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా అడిషనర్ కలెక్టర్ రాహుల్ శర్మ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించడం మన చేతుల్లోనే ఉందని,సురక్షితమైన లైంగిక జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ బారిన పడకుండా ఉండవచ్చు అన్నారు.హెచ్ఐవి వైరస్ బారిన పడినవారు అధైర్య పడకుండా డాక్టర్ సలహా మేరకు తగిన మందులు వాడుతూ మామూలు జీవితం గడపవచ్చని తెలిపారు.అనంతరం డైట్ కళాశాల సమావేశ మందిరంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ...ఎయిడ్స్‌కు మందు లేదు నివారణ ఒక్కటే మార్గమని,ఈ వ్యాధికి ఎక్కువగా యువకులు గురి అవుతున్నారని తెలియజేశారు.డా.పల్వన్ కుమార్ మాట్లాడుతూ...సురక్షతమైన సంభోగం వలన ఈ వ్యాధి వ్యాపించదని,మాదకద్రవ్యాల వలన వస్తుందని,ఇది రాకుండా చూసుకోవాలని తల్లి నుండి పిల్లలకు రాకుండా ఏఆర్‌టి మందులు వాడాలని ,సురక్షితమైన సూదులు,రక్త మార్పిడి వలన ఈ వ్యాది సంక్రమించదని తెలియజేశారు.అనంతరం ఎయిడ్స్‌పై పదవ తరగతి నుండి డిగ్రీ స్థాయి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్‌తో పాటు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు,వైద్య పర్యవేక్షణ అధికారులు,మహిళా ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు,జిల్లాలోని స్వచ్ఛంద కార్యకర్తలు,మహవీర్ మెడికల్ కళాశాల విద్యార్థులతో పాటు జిల్లా అంటు వ్యాధుల నివారణ అధికారి డా జీవరాజ్,డా.సాయిబాబా, డా.లలిత, డా.పవిత్ర,డా.మరియా,డా.అరవింద్,సిబ్బంది పాల్గొన్నారు.

## గీతామందిర్‌లో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

**-రేపు వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం**

**ఘట్‌కేసర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్‌లోని గీతామందిర్‌లో శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో గురువారం సంకల్ప విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, శ్రీలక్ష్మివెంకటేశ్వర మంటపారాధన, అకల్మహోమం,నీరాజనం, మంత్రపుష్పము తదితర పూజలు అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య నిర్వహించారు. ఆలయంలో శ్రీమద్భగవద్గీత భక్త సమాజం సభ్యులు నిత్యం అఖండ హరేరామ హరేకృష్ణ నామ సప్తాహము నిర్వహిస్తున్నారు. శ్రీశివరామకోటి జపయజ్ఞ సర్వాధ్యక్షులు శ్రీసదానందయోగీశ్వరులు (చింతపంటి సంజీవయ్య) ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలో భక్తులకు నిత్య అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. ఈనెల 3న శ్రీశివరామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యజ్ఞపూజ, సామూహిక గీతాహవనం, శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించనునా న్నరు.

# సీసీ రోడ్ల పనుల్లో నాణ్యతకు తిలోదకాలు

**-నిర్లక్ష్యపు నీడలో అధికారులు**
**-ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందే సిసి రోడ్డుకు పగుళ్ళు**



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు వేసిన సీసీ రోడ్డుపై ఏర్పడిన పగుళ్ళు



పది రోజులు గడువక ముందే పగుళ్ళు వచ్చిన సీసీ రోడ్డు

**కొడంగల్,డిసెంబర్ 1ప్రభాతవార్త**
కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణపు పనుల్లో నాణ్యతకు తిలోదకాలిస్తు నాసిరకంగా పనులు చేపడుతున్నా సంభందింత అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న రోడ్లు పది కాలాల పాటు పదిలంగా ఉండాల్సి ఉన్నా పట్టుమని 15రోజులు తిరగక ముందే పగుళ్ళు ఏర్పడుతుండడంతో కాంట్రాక్టర్ పనితీరు అధికారులు పర్యవేక్షణ ఏ పాటిగా నడుస్తున్నదో తేటతెల్లమవుతుంది.ఇసుక,సిమెంట్ సరైన మోతాదులో నిర్మాణం చేపట్టాల్సిన సీసీ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ మాత్రం కేవలం దస్టు,నాసిరకం సిమెంట్‌తో పనులు చేపడుతుండడంతో వారం రోజులు గడవక ముందే పగుళ్లు ఏర్పడుతుండడం పలు విమర్శలకు తావిస్తుంది.ఇది ఎక్కడో మారుమూల గ్రామాల్లో నాసిరకం పనులు నడుస్తున్నాయనుకుంటే దస్టులో కాలేసినట్లే.ఏకంగా కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే కా ్యంపు కార్యాలయం ముందే 15రోజుల క్రితం వేసిన సీసీ రోడ్డు నిలువుటద్దంలా కన్పిస్తుంది.కొడంగల్ మున్సిపల్ పరిధిలో నాసిరకం సీసీ రోడ్ల నిర్మాణంపై ప్రభాతవార్త ప్రత్యేక కథనం.కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లు,మురుగుకాల్వల నిర్మాణాలతో పాటు ఇతరాత్ర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్యే ్యక దృష్టి సారించి రూ.25 కోట్ల నిధులు మంజూరీ చేయించారు.అందులో భాగంగా మొదటి దశలో రూ. 15కోట్లు మంజూరీ కావడంతో వివిధ వార్డుల్లో కొంతమేర సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణ పనులు పూర్తి కాగానే అదనంగా మరో రూ.10కోట్లు కేటాయించారు.ఇందుకు సంభందించి గతకొన్ని నెలల నుంచి పనులు కొనసాగుతున్నాయి.గతంలో శాంతినగర్,కార్గిల్ కాలనీ,లాహోటీ,వినాయక్ చౌరస్తా నుంచి బాలాజీనగర్ కాలనీ,తెలంగ్‌వాడీ,సంతబజార్,షాబజార్ తదితర ప్రాంతాల్లో పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతుంది.ప్రస్తుతం శేరిగల్లీ, గాంధీనగర్,వడ్డర్‌గల్లీ కేఎస్‌వీ ఫంక్షన్‌హాల్ వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సిమెంట్‌లోకి కనీసం పిడికెడు ఇసుకను వాడడం లేదని ఏకంగా మున్సిపల్ చెర్మేన్ జగదీశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టి తీసుకువచ్చారు. పనులు జరుగుచున్న ప్రాంతంలో సంభందిత అధికారులు వచ్చి చూసిన దాఖలాలు లేవని పలువురు కౌన్సిలర్‌లు ఆరోపించారు.మరోపక్క మురుగుకాల్వల పనుల్లోను కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాలు ఇస్తు ఇష్టానుసారంగా స్టీల్ లేకుండానే పనులు చేపడుతున్నా పట్టించుకునే నాధుడే లేదని ఆయా కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలావుండగా సీసీ రోడ్ల నిర్మాణాల్లో వాటర్ క్యూరింగ్ లేదని రోడ్డు వేసి వదిలిపెడుతుండడంతో పగుళ్ళు ఏర్పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనుల్లో ఇసుకను వాడడం లేదని మున్సిపల్ చెర్మేన్ జగదీశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.ప్రస్తుతం కొనసాగుతున్న రోడ్లకు డస్ట్ వాడుతుండడంతో తొందరగానే రోడ్డు చెడిపోయే అవకాశం ఉందని తెలిపారు.నాసిరకం సీసీ రోడ్ల నిర్మాణ విషయమై ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళగా పనులు నాణ్యతతో చేపట్టకపోతే బిల్లులు నిలిపి వేస్తామన్నారు.సీసీ రోడ్ల నిర్మాణంలో వాటర్ క్యూరింగ్ తప్పనిసరి 15 రోజుల పాటు చేయాలన్నారు.అంతేగాక సీసీ రోడ్ల నిర్మాణంలో ఇసుక తప్పనిసరిగా వినియోగించాలని సంభందిత కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రాజబొల్లారంలోని ప్రభుత్వ భూమి కబ్జాకు ప్రజాప్రతినిధుల ప్రణాళికలు

**-సుమారు రూ. 3 కోట్ల విలువ చేసే స్థలం**
**-కాపాడాలని కోరుతున్న ప్రజలు**



రాజబొల్లారంలోని సర్వెనెంబర్ 38లో ఉన్న మిగులు ప్రభుత్వ భూమి

**మేడ్చల్, డిసెంబర్ 1. ప్రభాతవార్త ః**
ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొంతమంది ప్రజా ప్రతినిధులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు విస్వసనీయంగా తెలిస్తుంది. మేడ్చల్ మండలంలోని రాజబొల్లారంలోని సర్వే నెంబర్ 38లో సుమారు రెండు ఎకరాల ప్రభుత్వభూమి ఉంది. ఈ భూమిలో నూతనంగా గ్రామ పంచాయతీ భవణం, పల్లె ప్రకృతి వనం, నర్సరీని ఏర్పాటు చేయగా కొంత మిగులు భూమి ఉంది. ఈ స్థలానికి ఆనుకున్న ఉన్న సర్వేనెంబర్ 37 లోని భూమిలో వెంచర్ ఉంది. దీంతో ఈ ప్రాంత భూమి అత్యంత ఖరీదుగా మారడంతో ప్రభుత్వ స్థలంలో సుమారు రూ 3 కోట్ల విలువ చేసే మిగులు భూమిపై గ్రామానికి చెందిన కొంతమంది ప్రజా ప్రతినిధుల కన్ను పడినట్లు తెలుస్తుంది. పక్కనే ఉన్న వెంచర్ స్థలం సర్వేనెంబర్ చూపించి ప్రభుత్వ స్థలంలోని మిగులు భూమిని ఇతరులకు అమ్మేందుకు గతంలో ప్రయత్నాలు కూడ జరిగాయి. గ్రామంలో ఇరుకుగా ఉన్న గ్రామ పంచాయతీ భవణంలో ఇబ్బందిగా ఉందని గత పంచాయతీ పాలక వర్గం ప్రభుత్వ భూమిలో గ్రామ పంచాయతీ భవణం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మిగిలి ఉన్న భూమి ఇతరులెవ్వరూ అక్రమించకూడదని పల్లె ప్రకృతి వనం, నర్సరీని ఏర్పాటు చేశారు. ఇంకా అందులో సుమారు 15 గుంటలకు పైగా మిగిలి ఉన్న స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని గ్రామానికి చెందిన కొంతమంది రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఎట్టకేలకు ప్రభుత్వ స్థలంగా పరిగనిస్తూ అక్కడ బోర్డును ఏర్పాటు చేశారు. కాని ఈ స్థలాన్ని ఎలాగైన కబ్జా చేయాలనె ఉద్దేశ్యంతో గ్రామానికి చెందిన ప్రస్తుత ప్రజా ప్రతినిధులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. కాగా అధికారులు స్పందించి ఈ స్థలాన్ని కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కొడుకును దారుణంగా హతమార్చిన కసాయి తండ్రి

**-భూ తగాదాలే కారణమంటున్న స్థానికులు, పోలీసులు !**

**పెద్దేముల్, డిసెంబరు 1, ప్రభాతవార్త:**
కన్న కొడుకును స్వంత తండ్రే దారుణంగా హతమార్చిన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పెద్దేముల్ ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం..ఇందూరు గ్రామానికి చెందిన మహబూబ్ జానీకి ఇద్దరు భార్యలు. మొదటి భార్య రిజ్వానా భేగంకు కుమారుడు గోరెమియ్యా (30) ఓ కూతురు ఉంది. రెండవ భార్య ముంతాజ్ భేగంకు ఓ కూతురు ఉంది. అయితే ఇందూరులో జానీమియ్యా ఆయన చిన్న భార్య ముంతాజ్‌తో ఉంటు కాపురం కొనసాగిస్తున్నారు. గోరెమియ్యా ఆయన తల్లి రిజ్వానాతో హైద్రాబాద్‌లో ఉంటు కోళ్ళ ఫారమ్‌లో పనిచేస్తున్నాడు. మహబూబ్ జానీకి ఇందూరులో సుమారు 8 ఎకరాల భూమి ఉంది. అట్టి భూమిని తన పేర చెయ్యాలని పలుమార్లు తండ్రితో గోరెమియ్యా గొడవ పడ్డ సంఘటనలు ఉన్నాయి. బుదవారం నాడు హైద్రాబాద్ నుంచి గోరెమియ్యా ఇందూరుకు వచ్చాడు. భూమి విషయంలో ఉన్న గొడవలతో పాటు ఇంటి ముందు పడేసిన కట్టెల విషయంలో బుదవారం సాయంత్రం గొడవ పడ్డారు. గొడవ పడ్డ విషయము మనసులో ఉంచుకున్న మహబూబ్ జానీ రాత్రి 11.30 గంటల సమయంలో గోరెమియ్యా నిద్రిస్తుండగా అతడి తలపై కర్రతో విచక్షణ రహితంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం అయ్యి అక్కడిక్కడే మృతిచెందాడు. గట్టిగా అరుపులు విన్న పిర్యాదు దారుడి తమ్ముడు ముస్తఫా అక్కడికి వెళ్ళి చూడగా మహబూబ్ జానీ అతని భార్య ముంతాజ్ బేగం అక్కడి నుంచి పారిపోయారు. ఈ హత్యలో మృతుడి పిన తల్లి హస్తం ఉండవచ్చని పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. మృతుడి తల్లి రిజ్వానా భేగం పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రవూప్ తెలిపారు. సంఘటన స్థలాన్ని తాండూరు రూరల్ సిఐ రాంబాబు పర్యవేక్షించి, హత్యకు గల కారణాలను తెలుసుకుంటున్నామని అన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 01,(ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గురువారం లబ్ధిదారులకు అందజేశారు. జిల్లెడు చౌదరిగూడ మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన గొల్ల బాలయ్యకు రూ.60వేలు, బంగారు శ్రీశైలంకు రూ.24 వేలు, వీరన్నపేట గ్రామానికి చెందిన సత్తార్‌మీయాకు రూ. 18వేలు, కటికె సహాంగీర్‌కు రూ.36వేలు, పెద్ద ఎల్కిచర్ల గ్రామానికి చెందిన సుందర్‌రాజ్‌కు రూ. 60వేలు, సయ్యద్ ఉలాయత్‌కు రూ. 44వేలు, ముష్టిపల్లి గ్రామానికి చెందిన దివ్యకు రూ. 44వేలు, పద్మారం గ్రామానికి చెందిన బొమ్మగళ్ల కిష్టమ్మకు రూ. 28వేల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, జడ్పిటీసీ బంగారు స్వరూప, పీఏసీఎస్ చైర్మన్ ధామోదర్‌రెడ్డి, డైరెక్టర్ జబ్బార్, టీఆర్ఎస్ మండల అధ్యక్షులు హాఫీజ్, శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు ప్రేమ్‌కుమార్, వెంకటస్వామి, బాబురావు, హరినాయక్, ఎంపీటీసీలు రాములు, సత్యప్రమోద్‌రావు, నాయకులు గౌస్, రాంచంద్రయ్య, మోత్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హత సాధించిన అభ్యర్థులకు దుస్తులు పంపిణీ

**పరిగి డిసెంబర్1,ప్రభాతవార్త :** పరిగి పట్టణ కేంద్రంలో ఉన్న మినీ స్టేడియంలో ఎస్సై కానిస్టేబుల్ పరీక్షల్లో అర్హత సాధించి ఉన్న యువతి యువకులకు శారీరక దారుఢ్యం పరీక్షకు శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువతి యువకులు కష్టపడి ఉద్యోగాలలో రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్,సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి,ప్రభాకర్ గుప్తా,మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్,తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలి

### -టిఆర్ఎస్ నేత గోలి శ్రీనివాస్‌రెడ్డి



పులిగోనిపల్లి తండాకు చెందిన క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లను ప్రధానం చేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

**ఆమనగల్లు, డిసెంబర్01, ప్రభాతవార్త:** క్రీడల పట్ల యువత ఆసక్తి పెంపొందించుకుని తమలోని ప్రతిభ పాటవాలు బాహ్య ప్రపంచానికి చాటాలని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇతర రంగాలతోపాటు క్రీడా రంగాలతో జీవనోపాధి, పేరు ప్రఖ్యాతలు, గౌరవ మర్యాదలు దక్కుతాయని, ఆర్థిక స్వాలంభన లభిస్తుందని గోలి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పులిగోనిపల్లి గ్రామానికి చెందిన బాణావత్ రాహుల్, బాణావత్ అనిల్‌లు డెహ్రాడూన్‌లో జరగనున్న ఆల్ స్టార్స్ క్రికెట్ లీగ్ పోటీలకు అండర్ 19 రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. విషయం తెలుసుకున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి గురువారం తండాకు చేరుకుని క్రీడాకారులను కలిసి అభినందించారు. మారుమూల గ్రామంలో జన్మంచి తమ కలలను సాకారం చేసుకునేందుకు కృషి చేస్తున్న ఇద్దరూ అభినందనీయమన్నారు. క్రికెట్‌లో మరింతగా రాణించేందుకు ప్రోత్సహకంగా నూతన క్రికెట్ కిట్‌లను ప్రధానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమళ్ళ సుభాష్, పెద్దాపూర్ సర్పంచ్ గోరటి శ్రీనివాస్, టిఆర్ఎస్ రైతు విభాగం అధ్యక్షులు రూపం వెంకటరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, మాజీ సర్పంచ్ శంకర్, బింగిరాములు, సుమన్‌నాయక్, వడ్డేమోని శివకుమార్, బన్నెశేఖర్, వినోద్, రైసల్, ధర్మనాయక్, కళ్యాణ్, మహేశ్, గణేశ్, వరికుప్పల చింటూ పాల్గొన్నారు.

## పిఎం కిసాన్ లబ్ధిదారులు ఈకేవైసి తప్పనిసరి చేసుకోవాలి

### -మండల వ్యవసాయ అధికారి నసీరుద్దిన్



మాట్లాడుతున్న ఏఓ నసీరుద్దిన్

**పెద్దేముల్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాలలో జమ చేస్తున్న పిఎం కిసాన్ డబ్బుల కోసం ప్రతి పట్టదారు ఈకేవైసితప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నసీరుద్దిన్ అన్నారు. గురువారం పెద్దేముల్ మండలంలోని ఇందూరులోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆధార్‌కార్డు మొబైల్ నెంబర్ లింకు ఉన్న రైతులకు ఈకేవైసి చేయించారు. ఈ సందర్భంగా నసీరుద్దిన్ మాట్లాడుతూ ఆధార్ మొబైల్‌లింకులేని రైతులు సమీప మీసేవా కేంద్రాలలో లేదా పోస్టుఆఫీస్‌లో, సిఎస్‌పి సెంటర్‌లో ఈకేవైసి చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసి చేయకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చె లబ్ది చేకూరదని అన్నారు. రైతులందను ఈకేవైసి తప్పనిసరి చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ స్వాతి, తట్టెపల్లి సొసైటి డైరెక్టర్ ఎస్.మొగులప్ప, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ప్రకాష్, గ్రామపెద్దలు వీరేశం, పంచాయతీ కారోబార్ బందెప్ప, విఆర్ఏలు శ్రీను ఇబ్రాహీం తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నివారణకు యువత కృషి చేయాలి

**తాండూరు, డిసెంబరు 1, ప్రభాతవార్త:** ఎయిడ్స్ నివారణకు యువత కృషి చేయాలని పీపుల్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యానంద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరు పీపుల్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పట్టణంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రవీందర్‌రెడ్డి, మంజులబాయి, స్వాతిల ఆద్వర్యంలో విద్యార్థులతో కలిసి పట్టణ పుర వీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యానంద్ మాట్లాడుతూ.. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించడం తెలిపారు. మన దేశాన్ని ఎయిడ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీని నిర్వహిస్తున్న విద్యార్థులు.

# రాకంచెర్లలో ఘనంగా మైసమ్మ ఉత్సవాలు

**పూడూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని రాకంచెర్లలో నూతనంగా నిర్మించిన మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి.రెండు రోజులపాటు జరిగిన ఉత్సవాల సందర్భంగా బుధవారంరోజు మైసమ్మ మాతాకి గ్రామంలోని భక్తులు పలు రకాల పిండివంటలు తయారుచేసి నైవేధ్యం సమర్పించేందుకు ఒగ్గు కళాకారులు (బీర్లవారు)డోలు, వాయిధ్యాలు,డప్పు చప్పుళ్ల మధ్య వీధివీధిలో కలియ తిరుగుతూ దేవాలయం వరకు భారులు తీరారు.అనంతరం బొడ్రాయి పున: ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు.గురువారం మధ్యాహ్నం అమ్మవారి ఆలయం ఆవరణంలో చేర్యాల దుర్గమ్మ చేత భవిష్యవాణి కార్యక్రమం జరిగింది.అనంతరం పోతురాజుల విన్యాసాలు,శివ సత్తుల పూనకాలు భక్తులను ఆలరింపజేశాయి.మధ్యాహ్నం ఒగ్గు కళాకారులు (బీర్లవారు) శ్రీ మైసమ్మ మాత జీవత చరిత్రను కళారూపాలు (ఒగ్గుకథల) ద్వారా తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కమ్లీబాయి పెంటయ్య,మండల వివిద పార్టీల నాయకులు,చుట్టు ప్రక్కల గ్రామాలవారు



పూడూరు మండలం,రాకంచెర్లలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.దీంతో గ్రామం అంతా శ్రీ మైసమ్మవారి నామ స్మరణతో మార్మోగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ అద్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి,తీర్థ ప్రసాధాలు అందజేశారు.

# మోడల్ స్టేట్‌గా మారుతున్న తెలంగాణ :ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, తదితరులు

**కొందుర్గు, డిసెంబర్ 1, (ప్రభాతవార్త) :** దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ, ఉపాధి, అభివృద్ధి పథకాలను తెలంగాణలో ప్రవేశపెట్టి వాటిని పూర్తి స్థాయిలో అమలు చేస్తున్న మోడల్ రాష్ట్రంగా మామూతుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కళ్యాణలక్ష్మీ, సీఎం రిలిఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం డిజిల్, పెట్రోల్‌పై పెంచుతున్న ధరల వలన నిత్యవసర వస్తువులపై భారం పదుతుందని ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. మీషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులకు కుంటలకు మరమ్మత్తులు చేయటం వల్లనే అవి నేడు జలంతో కళకళలాడుతున్నాయన్నారు. తద్వారా వ్యవసాయ బోర్లన్ని పుష్కలంగా నీటిని పోస్తున్నాయన్నారు. అంతేకాకుండా రాష్ట్రానికి సరిపడు జల విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఇంకా రాష్ట్రాభివృద్ధి అన్ని రంగాలల్లో అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రికి ప్రజలందరూ మద్దత్తు ఇవ్వాలని కోరారు. ఆడపడుచుల వివాహానికి పెద్దన్నగా తనవంతు సహాయ సహకారాలు అందించాలనే ఆశయంతోనే కళ్యాణ లక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టి 1లక్ష 116 రూపాయలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. 20 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను 10 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోతురాజు జంగయ్య, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఆర్ఐలు మహేందర్‌గౌడ్, పవన్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రెడ్డి నర్సింలు, సర్పంచులు కావలి ఆదిలక్ష్మీ, నర్సింహ్మారెడ్డి, బి.నర్సింహ్మా, ఆంజనేయులు, పి.నర్సింలు, దర్గా సరస్వతి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రామగళ్ల సుందర్, ఎదిరా రామకృష్ణ, దర్గా రాంచందర్, ఎ.మాణయ్య, గోపాల్, యాదగిరి, సున్నాల శ్రీను, నర్సింలుగౌడ్, విజయ్‌కుమార్, పస్పుల శేఖర్, బుయ్యని రవి యాదవ్, బలవంత్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, రవిగౌడ్, అబ్దుల్ కలామ్, మాసయ్యగౌడ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 5న వికారాబాద్‌కు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రాక..

-ధరణిపై కాంగ్రెస్ మహాధర్నా
-డీసీసీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, డిసెంబర్ 01, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 5న వికారాబాద్‌లో నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ముఖ్యతిథిగా హాజరవుతారని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్‌లు తెలిపారు. గురువారం ప్రసాద్‌కుమార్ నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ధరణి సమస్యలతో రైతులు తల్లడిల్లిపోతున్నారని, భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు ధరణి పోర్టల్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రైతు రుణ మాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికీ రుణమాఫీ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. రైతు బంధు, రైతు భీమా ను అమలు చేయడంతో పాటు ధరణి భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా కార్యక్రమం నిర్వహించ తలపెట్టామని అన్నారు. ధర్నా కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి వికారాబాద్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మురళి, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కిషన్‌నాయక్, జె.రత్నారెడ్డి, జి.నర్సిములు, వెంకట్‌రెడ్డి, రెడ్యానాయక్, చాపల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

# రసాభాసగా మంబాపూర్ గ్రామసభ

### -మెజార్టీ స్థాయి వార్డు మెంబర్లు లేక వాయిదా



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

**పెద్దేముల్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలంలోని మంబాపూర్‌లో గురువారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. సర్పంచ్ ఆర్ శ్రావన్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు పది మంది వార్డు మెంబర్లకు గాను ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. గ్రామంలో అక్కడక్కడ చేపట్టనున్న అభివృద్ధి పనులకు తీర్మాణం ఇవ్వకపోవడం, తమకు పని ఇవ్వడంలేదంటు కొందరు వార్డు మెంబర్లు చెప్పడం, గతంలో వార్డులలో చేపట్టిన సీసీ రొడ్డు పనుల బిల్లులు చెల్లించకపోవడం తదితర అంశాలను గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చారు. తమ పనులను మానుకొని గ్రామసభకు వస్తే వార్డు సభ్యులు మాత్రము రాకపోవడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధి హామి ద్వారా ఆయా భూములలో భూమి చదును చేయడం, మట్టి కట్టలు, వ్యక్తిగత పనులు తదితర వాటికోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని టెక్నికల్ అసిస్టెంట్ విజయ్ కుమార్ తెలిపారు. మెజార్టీ స్థాయి వార్డు మెంబర్లు లేకపోవడంతో గ్రామసభను వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సంజయ్ తెలిపారు. నాలుగైదు రోజుల్లో మరోమారు గ్రామ సభను నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీఆర్ఎస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి, జడ్‌ఎహెచ్ఎస్ హెచ్ఎం రాములు,ఎఎన్ఎం కవిత, అంగన్‌వాడి టీచర్లు లక్ష్మి, భారతి, ఫీల్డ్ అసిస్టెంట్ చెక్క ఆనందం, నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి,బుగ్గయ్య, ఇబ్రాహీం, వహీద్, గ్రామస్థులు టి.రాములు,దస్థప్ప,ఎస్ చంద్రప్ప పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను తీర్చి అభివృద్ధి పనులు: సర్పంచ్

-ఇంటి పన్నులు చెల్లించి జీపీకి తోడ్పడండి
-ఎస్సీ శ్మశానవాటికకు రోడ్డు కల్పించాలి
-విద్యుత్, నీటి సమస్యలు పరిష్కరించాలి
-కాలనీల్లో సౌకర్యాల కల్పనకు కృషి: కార్యదర్శి

**ఘట్‌కేసర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** పంచాయతీ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలను దశలవారిగా పరిష్కరించి కాలనీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చౌదరిగూడ సర్పంచ్ బైరు రమాదేవి అన్నారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం సర్పంచ్ బైరు రమాదేవి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామప్రజలు హజరై పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. వెంకటాద్రిటౌన్‌షిప్, వైష్ణవినగర్, స్వర్ణగిరికాలనీ, విజయసాయినగర్, రామాలయంకాలనీల్లో రోడ్డు, విద్యుత్, నల్లాలు, డ్రైనేజీ, జలమండలి నీటి సమస్యలను కాలనీ ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. దుర్గమ్మగుడి ఎదురుగా ఉన్న నాలా పక్క నుంచి ఎస్సీల స్మశానవాటికకు వెళ్లే రోడ్డును ఆక్రమించి గోడ నిర్మించారని రోడ్డు సౌకర్యం కల్పించాలని, చౌదరిగూడ ఎస్సీ కాలనీల్లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బోరు వేయాలని, రెండు కరెంట్ స్తంబాలు ఏర్పాటు చేయాలని వార్డుసభ్యులు మంచాల సుధాకర్, నాయకులు ఏనూతల నాగేశ్ తెలిపారు. జోడిమెట్ల చౌరస్తాలో హైవేపై ఆటోలు అడ్డంగా నిలబెట్టి వాహనదారులకు ఇబ్బందులు కల్గిస్తున్నారని, హస్టళ్ల నుంచి వ్యర్థాలు తెచ్చి బయట వేస్తుండటంతో కోతులు ఆహారం కోసం ఎగబడుతున్నాయని నాయకులు నర్సింగ్ పేర్కొన్నారు. డ్రైనేజీలో పైపులు వేసేవారు, నల్లా కనెక్షన్ లైన్ తీసుకుంటున్న ఇళ్ల యాజమానులు సిసి రోడ్లను ధ్వంస చేసి రోడ్డును పాడుచేస్తున్నారని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. గ్రామసభకు విద్యుత్ అధికారులు, సిబ్బంది హాజరు కాకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని వార్డుసభ్యులు మంద స్వామిదాస్‌తో పాటు ప్రజలు పేర్కొన్నారు. ఈసందర్భంగా పారిశుద్యం, హరితహారం, వీధిదీపాలు, అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్ అధ్యక్షతన, కార్యదర్శి కన్వీనర్‌గా, వార్డుసభ్యులు, సభ్యులుగా స్టాండింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం సర్పంచ్ రమాదేవి, కార్యదర్శి శోభారాణిలు గ్రామసభలో మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు చేసిన విజ్ఞప్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని, చెత్త బయట వేయకూడదని వారు సూచించారు. ఈగ్రామసభలో ఎంపిటిసి సభ్యులు పులకంటి భాస్కర్‌రెడ్డి, నిరుడి రామారావు, వార్డుసభ్యులు మంచాల సుధాకర్, మంద స్వామిదాస్, పసులాది నవ్య, బండ్లగూడెం వాణీగౌడ్, పులకంటి సంయుక్త, బైరు లక్ష్మణ్‌గౌడ్, పాలడుగు అరుంధతి, కోఆప్షన్‌సభ్యులు అల్వాల వెంకటేశ్, మాజీ సర్పంచ్ బైరు రాములుగౌడ్,మాజీ వార్డుసభ్యులు మంద లక్ష్మమ్మ పాల్గొన్నారు.




చౌదరిగూడ గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ రమాదేవి, గ్రామకార్యదర్శి శోభారాణి

## అహ్మద్‌గూడలో ఘనంగా దాసాంజనేయ స్వామి 18వ వార్షికోత్సవం

**కీసర,డిసెంబరు1,ప్రభాతవార్త:** ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని దమ్మాయిగూడ మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్ అన్నారు.గురువారం మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ గ్రామంలో దాసాంజనేయ స్వామి 18వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ అధ్యక్షులు కౌకుట్ల తిరుపతిరెడ్డి,మాజీ ఎంపిటిసిలు శ్రీనివాస్‌గౌడ్,నర్సింహ్మాగౌడ్,మాజీ సర్పంచ్ యాదగిరిగౌడ్,నాయకులు రాజు ముదిరాజు,బాల్‌రెడ్డి, గోవింద్‌సింగ్, శ్రీనివాస్‌సింగ్,అంజయ్యగౌడ్,పంతులు రఘునందన్‌శర్మ పాల్గొన్నారు.



దాసాంజనేయ స్వామి 18వ వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్

## బంగారు తెలంగాణలో నెల దాటినా పెన్షన్లు రావు



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** బంగారు తెలంగాణలో నవంబర్ నెల దాటినా కూడా ఆసరా పెన్షన్లు అందడం లేదని దింతో వికలాంగులు ,వృద్ధులు,వితంతువులు,ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా అధ్యక్షుడు సుధీర్ అధ్యక్షతన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వంలో వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని,వికలాంగులను పట్టించుకునే నాయకులే కరువయ్యారని ఏద్దేవా చేశారు.డిసెంబర్ 3వ తేది ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ పాల్గొని ప్రతి జిల్లాకు 3కోట్ల రూపాయలు ఇవ్వాలని అదే విధంగా వికలాంగులకు 5శాతం డబుల్ బెడురూమ్ ఇళ్లల్లో రిజర్వేషన్ కల్పించాలని బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని 2016,92 ఎ,బి సెక్షన్‌ను పరిపూర్ణాంగా అమలే చేసేలా పోలీస్ శాఖ ఆదేశాలు జారీ చేయాలని ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా నడవలేని వారికీ 3వీలర్ మోటార్ బైక్‌లు అందించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని,ప్రగతి భవన్ ముట్టడి కూడా చెస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బివిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త జెర్దయ్య,వివిధ మండలాల వికలాంగులు, సత్యమ్మ, సత్యయ్య, భాగ్యమ్మ,లలిత,నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్‌కు ఎంపికైన కొడంగల్ విద్యార్థిని మణిదీప

**కొడంగల్,డిసెంబర్ 1ప్రభాతవార్త** కొడంగల్ పట్టనానికి చెందిన ఊట్కూర్ మణిదీప నీట్‌లో మెరుగైన ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటును ఉచితంగా సాధించారు.జాతీయ స్దాయిలో గతంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో 470 మార్కులు వచ్చాయి.దీంతో కాళోజీ నారాయణరావ్ యూనివర్శిటీ నిర్వహించిన కౌన్సిలింగ్‌లో వనపర్తిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందారు.ఈ నేపథ్యంలో గురువారం కళాశాలలో ప్రవేశం పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా మణిదీప మాట్లాడుతు తమ కుటుంబ సభ్యుల ప్రోత్సహంతో మెడికల్ సీటు సాధించినట్లు చెప్పారు.పెద్దనాన్న ఊట్కూర్ నారాయణరావు తనను ఎంతగానో ప్రోత్సహించినట్లు తెలిపారు.భవిష్యత్తులతో వైద్యవృత్తిలో స్దిరపడి పేద రోగులకు సేవ చేయనున్నట్లు చెప్పారు.

## ఎంబిబిఎస్‌కు అర్హత సాధించిన పెద్దేముల్ వాసి



మీనాల్‌ను అభినందిస్తున్న సర్పంచ్ తదితరులు

**పెద్దేముల్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన చాకలి రఘు కుమార్తె మీనాల్ యంబిబిఎస్‌కు అర్హత సాధించింది. సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ సురభి మెడికల్ కళాశాలలో మీనాల్ యంబిబిఎస్ సీటు సాధించడంతో గురువారం సర్పంచ్ ద్యావరి విజయమ్మ, సొసైటి చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. వైద్య విద్యలో రాణించి పేద ప్రజలకు సేవా చేయాలని వారు కోరారు. మీనాల్‌కు అభినందనలు తెలిపిన వారిలో మాజీ సొసైటి చైర్మెన్ వెంకటరెడ్డి, టిఆర్ఎస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు డివై నర్సిములు, కారోబార్ నర్సిరెడ్డి, బోయిని నర్సిములు తదితరులు ఉన్నారు.

## క్రీడల నిర్వాహణ కార్యదర్శిగా నరేందర్

**తాండూరు, డిసెంబరు 1, ప్రభాతవార్త:** స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) తాండూరు జోన్ కార్యదర్శిగా తాండూరు మండలం కరణ్‌కోట్ జిల్లా పరిషత్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బి.నరేందర్ ఎంపికయ్యారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఆద్వర్యంలో ఎస్‌జీఎఫ్ఐ 2022-24 విద్యాసంవత్సరానికి సంబంధించి తాండూరు జోన్(తాండూరు, యాలాల, బషీరాబాద్ మండలాల) జోనల్ కార్యదర్శిగా నరేందర్‌ను ఎంపిక చేశారు. తాండూరు జోన్ కార్యదర్శిగా ఎంపికైన నరేందర్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## అంబేద్కర్ జ్ఞాన సభను విజయంతం చేయాలి



అంబేద్కర్ జ్ఞాన సభ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

**కొడంగల్,డిసెంబర్ 1ప్రభాతవార్త** కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గీ మండల కేంద్రంలో ఈనెల 6న నిర్వహించనున్న అంబేద్కర్ జ్ఞాన సభను విజయవంతం చేయాలని తెలంగాణా ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షులు ఎర్రన్‌పల్లి శ్రీనివాస్,యువజన కాంగ్రేస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణంరాజులు పిలుపునిచ్చారు.గురువారం స్దానిక ఐబిలో అంబేద్కర్ జ్ఞాన సభ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు.కోస్గీలో నిర్వహించనున్న అంబేద్కర్ జ్ఞాన సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ సందర్భంగా బీసీ సంఘం తాలూకా అధ్యక్షులు భీమరాజు,ధర్మపురి అశోక్,కాంగ్రేస్ ఎస్టీసెల్ అధ్యక్షులు తార్యానాయక్,అంబేద్కర్ సంఘం నాయకులు ప్రమోద్,గౌరిగాళ్ళ కృష్ణ,చిన్న,బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలకు అడ్డుకుంటే అంతు చూస్తారా

### -పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు రొయ్యపల్లి మల్లేష్‌గౌడ్

**మేడ్చల్, డిసెంబర్ 1. ప్రభాతవార్త :** అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్నందుకు అంతు చూస్తామని బెదిరింపు కాల్‌లు వస్తున్నాయని,తనకు రక్షణ కల్పించాలని కోరుతూ అత్వెల్లి గ్రామానికి చెందిన రొయ్యపల్లి మల్లేష్‌గౌడ్ మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి గ్రామ శివారులో ఉన్న లోటస్ వెంచర్‌లో గ్రామానికి చెందిన టీఆర్ఎస్ నేత, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందారెడ్డి పార్కు స్థలం ఆక్రమించి అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నాడని ఇటీవల జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. కాగా ఆ స్థలంలో కట్టడం అలాగే కొనసాగుతుండగా ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నాడు. ఈ క్రమంలో తనకు గురువారం ఉదయం వరంగల్ ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి ఫోన్ చేసి ఈ విషయంలో పట్టించుకోవద్దని, లేదంటే నీ అంతు చూస్మామని బెదిరించినట్లు ఆయన పేర్కొన్నాడు. దీంతో తనకు ప్రాణభయం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసి, బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని సీఐని కోరినట్లు తెలిపాడు.



మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన మల్లేష్‌గౌడ్

## తెలంగాణ ఉద్యమకారుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి



కీసరలో తెలంగాణ ఉద్యమకారుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ముదిరాజు నాయకులు

**కీసర, డిసెంబరు1, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కీసరలో మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని కీసరలోని అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్, ముదిరాజు సంఘం నాయకులు ఏలూరి శ్రీనివాస్ ముదిరాజు, రాగుల అశోక్ ముదిరాజు, ఆనబోయిన జంగయ్య ముదిరాజు, కావలి నారాయణ ముదిరాజు, ధర్మారం శ్రీనివాస్ ముదిరాజు, సింగారం నారాయణ ముదిరాజు, మహేష్, రాగుల రమేష్, చిక్కుడు రమేష్, కనబోయిన రమేష్, బోయిని జంగయ్య, గణేష్, గంగదారి భానుచందర్, ఆనబోయిన విజయ్, మంత్రాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## నందివనపర్తి అభివృద్ధికి రూ. 10 లక్షలు ఎమ్మెల్యే నిధులు మంజూరు: బిలకంటి శేఖర్‌రెడ్డి



ఎమ్మెల్యే చేతుల మీదుగా నిధుల మంజూరు ఉత్తర్వులను అందుకుంటున్న శేఖర్‌రెడ్డి తదితరులు

**యాచారం, డిసెంబర్ 1 ప్రభాతవార్త**
మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామపంచాయితీకి ఎమ్మెల్యే నిధుల నుండి రూ. 10 లక్షల నిధులను మార్కెట్ యార్డు నిర్మాణానికి మంజూరు ఉత్తర్వులను గురువారం టిఆర్ఎస్ నాయకులు బిలకంటి శేఖర్‌రెడ్డికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నందివనపర్తి గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### గూడూరులో కేజీఎన్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంపిపి

**కొత్తూర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :**
కొత్తూర్ మండలంలోని గూడూరు గ్రామంలో కేజీఎన్ రియల్ ఎస్టేట్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా కొత్తూర్ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి హాజరై భవనాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా కేజీఎన్ తరపున కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ఎండీ అమీర్ ధన్యవాదాలు తెలియజేశారు.

### అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో స్వాములకు అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న స్వాములు

**కొత్తూర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :**
శంకర్‌పల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో అయ్యప్ప మాల ధరించి దీక్ష స్వీకరించిన అయ్యప్ప స్వాములకు పురపాలిక కేంద్రానికి చెందిన అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో 41 రోజుల పాటు చేపట్టనున్న అన్నదాన కార్యక్రమాన్ని అయ్యప్ప సేవాసమితి, దేవాలయ కమిటీ వారు తొలిరోజు కన్నె స్వామి వంశిగౌడ్ చేత ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ ఆలయంలో పట్టణ పరిసర ప్రాంతాల్లో అయ్యప్పమాల ధరించిన స్వాములందరికి 41రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అయ్యప్ప సేవ సమితి అధ్యక్షులు ఎర్రవెల్లి నాగరాజుచారిస్వామి, కౌన్సిలర్స్ మాదారం నర్సింహ్మాగౌడ్ స్వామి, సోమ్లానాయక్, దాసరి నరసింహ స్వామి, దాసరి శ్రీనుస్వామి, చెన్నారెడ్డి స్వామి, కనకరెడ్డి స్వామి, గోపి స్వామి, కారుణ్యరెడ్డి స్వామి, వీరమోని శ్రీనుముదిరాజ్‌స్వామి, కాంట శ్రీను స్వామి, అరవింద్ స్వామి, లడ్డు స్వామి, శ్రీకాంత్‌స్వామి, అయ్యప్ప స్వాములు ఉన్నారు.

### చింతపట్ల గ్రామ యువజన కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక



యువజన కాంగ్రెస్ గ్రామశాఖ నూతన కమిటీ ఎన్నిక దృశ్యం

**యాచారం, డిసెంబర్ 1 ప్రభాతవార్త**
మండల పరిధిలోని చింతపట్ల గ్రామశాఖ యువజన కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని గురువారం యువజన కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు గౌరారం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు రెడ్డమోని వెంకటేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు పాం దురం గారెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అఖిల్, ప్రధాన కార్యదర్శి జగన్, మల్కీజ్‌గూడ సర్పంచ్ తనయుడు శేఖర్, ఎంఆర్‌ఆర్ విక్రమ్, చింతపట్ల గ్రామశాఖ యూత్ ప్రెసిడెంట్‌గా డి. నర్సిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లుగా గోరెట్టి ఫర్వీన్, దేవరకొండ నాగేష్, ప్రధాన కార్యదర్శులుగా బండి వెంకటేష్, ఎండి షబ్బీర్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా అజయ్‌లను ఎన్నుకున్నారు.

### జాయింట్ చెక్ పవర్‌కు వార్డు సభ్యుడి ఎన్నిక

**మేడ్చల్, డిసెంబర్ 1. ప్రభాతవార్త :**
మేడ్చల్ మండలంలోని రాజబొల్లారం తండా పంచాయతీ జాయింట్ చెక్ పవర్‌కు గ్రామ వార్డు సభ్యుడు సక్రును ఎన్నుకున్నారు. గ్రామ సర్పంచ్ మాంగ్యా నాయక్ అధ్యక్షతన గురువారం తండాలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఉప సర్పంచ్ జాయింట్ చెక్ పవర్‌ను తొలగించి ఆ స్థానంలో వార్డు సభ్యుడికి అవకాశం కల్పించారు. ఉప సర్పంచ్ గ్రామ పంచాయతీ సమావే శాలకు రాకుండ, చెక్కులపై సంతకాలు చేయడం లేదని గతంలో గ్రామ సర్పంచ్ అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘతి తెలిసిందే. కాగా గురువారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పద్మావతి, ఎంపీవో వినూత్న, ఎంపిటిసి అంకిత రవి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపిడివో, ఎంపీవో, సర్పంచ్ తదితరులు

# దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**కుల్కచర్ల డిసెంబర్ 01, ప్రభాతవార్త :**
దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి, డిసిసిబి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్‌బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం కుల్కచర్ల మండల పరిదిలోని బండవెల్కిచర్ల శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులకు వారు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాంబండ దేవాలయం రాష్ట్రంలోనే ఏకశిలా పర్వతంగా పేరు గడించిందని దేవాలయం దినదినాభివృద్ధి చెందుతుందని అందులోబాగంగా కళ్యాణ మంటపం, అదనపు గదుల నిర్మాణం చేపట్టబోతున్నట్టు వారు తెలిపారు. తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడ్డాక యాదాద్రి పున;నిర్మించి కోట్లాది మందిని ఆద్యాత్మికం వైపునడిపిందని దేవాలయాలు అభివృద్ధి సాదించాలని సిఎం కేసిఆర్ ప్రతిన బూనారని వారు అన్నారు. అనంతరం బండవెల్కిచర్ల గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటి భవనాన్ని వారు ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, ఎంపిపి సత్య హరిశ్చందర్, మార్కెట్ కమిటి చైర్మన్ బృంగి హరికృష్ణ, రైతుబందు అధ్యక్షుడు పీరంపల్లి రాజు, టిఆర్ఎస్ మండల అద్యక్షుడు శేరి రాంరెడ్డి, ఆలయ ఈవొ సుదాకర్, ఆలయ కమిటి చైర్మన్ రాములు, సర్పంచ్ శిరీష లక్ష్మారెడ్డి, ఎంపిటిసి జ్యోతి, ఆలయ కమిటి సభ్యులు సంజీవ్‌గౌడ్ టిఆర్ఎస్ నాయకులు మఠం రాజశేఖర్, సారా శ్రీనివాస్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణ మంటపానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

## తెలంగాణ మలిదశ ఉద్యమ వీరుడు కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్‌కు నివాళి



శామీర్‌పేటలో తెలంగాణ మలిదశ ఉద్యమతొలి వీరుడు కానిస్టేబుల్ కిష్టయ్యముదిరాజ్‌కు వర్ధంతి సందర్భంగ నివాళులు అర్పించిన ముదిరాజ్ సంఘం, టిఆర్ఎస్ నాయకులు



కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగ నివాళులు అర్పించిన కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి ఎండి అఫ్జల్‌ఖాన్, పాల్గొన్న నాయకులు

**శామీర్‌పేట, డిసెంబరు 1, ప్రభాతవార్త**
తెలంగాణ మలిదశ ఉద్యమ కారుడు తొలి అమరవీరుడు కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ 13వ వర్ధంతి సందర్భంగ శామీర్‌పేటలో పలువురు నాయకులు నివాళులు అర్పించారు. గురువారం శామీర్‌పేటలో ముదిరాజ్ సంఘం నాయకులు, టిఆర్ఎస్ నాయకులు, కెసిఆర్ సేవాదళం నాయకులు వేరువేరుగా కానిస్టేబుల్ కిష్టయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి ఎండి అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ సాధనలో ఆలస్యం అవుతుందన్న మనస్థాపంతో కానిస్టేబుల్ కిష్టయ్య తన సర్వీస్ తుపాకితోనే కాల్చుకుని తెలంగాణ కోసం ప్రాణాలు పోగొట్టుకుని అమరవీరునిగా నిలిచారని అన్నారు. అమరుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి అప్జల్‌ఖాన్‌తో పాటు మండల అధ్యక్షులు ఎండి నిసార్‌అహ్మద్‌ఖాన్, జిల్లా కార్యదర్శి పి.నర్సింహ్మారెడ్డి, నాయకులు బి.చందర్, పి.పోచయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగ శామీర్‌పేటలోని టిఆర్ఎస్ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు కానిస్టేబుల్ కిష్టయ్యముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన తెలంగాణ ఉద్యమంలో ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ తెలంగాణ కోసం అమరుడు కావటం చారిత్రాత్మకమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పవన్‌ముదిరాజ్, మాజీ ఎంపిటిసి డి.కుమార్‌ముదిరాజ్, మాజీ వార్డుసభ్యులు ఎస్.శ్రీనివాస్‌ముదిరాజ్, నాయకులు ఎస్.రమేష్, ఎం.అంజనేయులు, ఎస్.రమేష్, డి.మహేందర్, ఎన్.నాగరాజు, రాము, రాజు, పరుశరాములు, తదితర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్‌పై ప్రజలలో చైతన్యం అవసరం: మల్లేశ





ఏయూలో జరిగిన ఎయిడ్స్ అవగాహన సదస్సులో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మల్లేశ తదితరులు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:**
సమాజంలో ఎయిడ్స్ వ్యాధిపై ఇంకా చైతన్యం తీసుకురావాల్సిన అవసరముందని ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ చెన్నకేశ్ మల్లేశ అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో గురువారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలీంటర్లు, రెడ్‌రిబ్బన్‌క్లబ్‌లు నిర్వహించిన సదస్సులో మల్లేశ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐసిటిసి కేంద్రం ఉంటుందని ఎయిడ్స్‌కు సంబంధించిన సమాచారం, మందులు, పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవగాహన సదస్సుల ద్వారా ఎయిడ్స్ వ్యాప్తిని నివారించడానికి కృషి చేయాలని, ఎయిడ్స్ బారిన పడిన బాధితులను ఆదుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ అధికారి నవీన్, ఫార్మసీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.బాబాశంకర్‌రావు, వాలీంటర్లు వినూత్న, తరుణి, శృతి, ప్రణిష్, మనీషా, సల్మా, సింధులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని సన్మానించిన కౌన్సిలర్లు

**మెదక్ అర్బన్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** మెదక్-దాయర రోడ్డుకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి గురువారం మున్సిపల్ కౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఆమెకు మిఠాయిలు తినిపించి, శాలువాలతో సత్కరిం చారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అవారి శేఖర్, వసంత్‌రాజ్, జయరాజ్, నాయకులు రాగి అశోక్, సాయిరాం, శివరామకృష్ణ, కొండ శ్రీనివాస్, శంకర్, ఉమర్, జుబేర్, మహమ్మద్ తదితరులు ఉన్నారు.

### కిష్టాపూర్ పాఠశాలను సందర్శించిన ఎంఇవో

**కొల్చారం, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ఇన్‌స్పైర్ జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతి పొందిన కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠ శాల విద్యార్థి ఎం.విజయ్‌కుమార్‌ను మండల విద్యాధికారి నీలకంఠం అభి నందించారు. గురువారం కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సంద ర్శించిన నీలకంఠం ఎఫ్ఎల్ఎన్ పరిశీలనతోపాటు ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిని అభినందిస్తూ ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలోనూ ఎన్నికై జాతీయ స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజ నాన్ని పరిశీలించారు. అనంతరం పోతంశెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతంశెట్టిపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఎఫ్ఎల్ఎన్, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉన్నారు.

**పాఠశాలల్లో పనులను పరిశీలించిన ఎంఇవో...**

**కొల్చారం, డిసెంబర్1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న మర మ్మతు పనులను గురువారం మండల విద్యాధికారి నీలకంఠం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యుత్, త్రాగునీరు పనులను ఎస్ఎంసీ చైర్మన్ యాదగిరి, ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు.

### వినియోగదారులకు సేవలు అందించడమే లక్ష్యం

నాగారం డిసెంబర్1, ప్రభాతవార్త : ఓలా ఎలక్ట్రిక్, భారతదేశంలోని అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీ, దేశమంతటా జరుగుతున్న దాని డిటుడి అడుగుజాడల విస్తరణ ప్రక్రియలో భాగంగా సికింద్రాబాద్‌లో దాని మొట్టమొదటి అనుభవ కేంద్రాన్ని తెరచినట్లుగా ప్రకటించింది. సర్దార్ పటేల్ రోడ్డు, బేగంపేటలో ఉన్న ఈ కొత్త కేంద్రం వారివారి సౌకర్యాన్ని బట్టి ఓలా స్కూటర్ల మరియు సేవల యాక్సెస్‌ని శీఘ్రంగా మరియు సులభంగా బస్తీలని ఆనందించడానికి సామర్థ్యానిస్తుంది. ఒకే చోట అన్ని సేవలను అందించాలనే లక్ష్యంతో ఓలా అనుభవ కేంద్రాలు ఈవి ఔత్సాహికులకు ఓలా యొక్క ఈవి సాంకేతికతను అనుభవించడానికి మరియు వాహనాల గురించి ఏదేని సమాచారం తెలుసుకోవడానికి అనుమతిస్తుంది.

### బిజెపిని అధికారంలోకి తీసుకురావడానికి కృషిచేయాలి

**నిజాంపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో గురువారం బిజెపి మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు తాళ్ళపల్లి రాజశేఖర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బాలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంలో నిరుపేద కుటుంబాల కోసం సంక్షేమ పథకాలను కేటాయించిందని, రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పసల్ బీమా పథకాన్ని అమలు చేయడం లేదని, కరోనా కష్టకాలంలో మూడు డోసులు కలిగిన ఉచిత వ్యాక్సిన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రజలకు ఉచితంగా అందజేశారని అన్నారు. బిజెపి సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లి వచ్చే ఎన్నికలలో అధికారంలోకి రావడానికి కృషి చేయా లని పిలుపునిచ్చారు. అనంతరం మండల బిజెపి అధ్యక్షుడు చంద్రశేఖర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

### న్యాయవాదుల కోసం రక్షణ చట్టం అమలు చేయాలి

-బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోకట్ మాధవరెడ్డి

**వికారాబాద్, డిసెంబర్ 01, ప్రభాతవార్త:**
న్యాయాన్ని కాపాడే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, న్యాయవాదుల కోసం రక్షణ చట్టం అమలు చేయాలని వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోకట్ మాధవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సిటీ సివిల్ కోర్టు లో న్యాయవాదిపై జరిగిన భౌతిక దాడికి నిరసనగా గురువారం వికారాబాద్ జిల్లా కోర్టు న్యాయవాద సంఘము ఆధ్వర్యములో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ, న్యాయవాది యాకుబ్ పై కొంతమంది భౌతిక దాడికి పాల్పడడం హేయమైన చర్య అని ఉద్ఘాటించారు. న్యాయవాదులు సివిల్ కేసులలో కక్షిదారుల కొరకు న్యాయబద్ధంగా పోరాడుతారని అన్నారు. అలాంటి న్యాయవాదుల పై దాడులు జరిగితే ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు స్పందించి న్యాయవాద రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో న్యాయవాద దంపతులైన వామన్ రావు, నాగమణి హైకోర్టు న్యాయవాదుల పైన భౌతిక దాడికి పాల్పడి, దారుణంగా హతమార్చడం తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదులకు ప్రాణ రక్షణ లేకుండా పోయిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యనే వరంగల్ జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది మల్లారెడ్డి హత్య, నల్లగొండ జిల్లాలో న్యాయవాది విజయభాస్కర్ రెడ్డి దారుణ హత్య, మల్కాజిగిరి కోర్టులో మహిళ న్యాయవాది ప్రసన్న పై భౌతిక దాడి, రాజేంద్రనగర్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న శివకుమార్ పై భౌతిక దాడి వంటి ఘటనలు జరుగుతున్న ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. న్యాయవాదులే కాదు తీర్పులిచ్చే న్యాయమూర్తులకు రక్షణ కరువైంది అని అన్నారు. జార్ఖండ్లో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పై ఆటో తో ఢీకొట్టి ప్రాణాలు తీశారని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు బట్టి న్యాయవ్యవస్థకు రక్షణ లేదని తేటతెల్లమవుతుందని, ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల కొరకు, న్యాయ వ్యవస్థ కొరకు రక్షణ చర్యలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బస్వరాజ్, కమాల్‌రెడ్డి, న్యాయ వాదులు అవుటి రాజశేఖర్, శేఖర్, లక్ష్మణ్, రాంచందర్ పాల్గొన్నారు.

### రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి : ఎవో

**నిజాంపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి కిసాన్ పథకంలో బాగంగా సంవత్సరానికి రూ. 6 వేల పొందుతున్న రైతులందరూ ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సతీష్ అన్నారు. ఈ మేరకు నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో గురువారం నాడు ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పీఎం కిసాన్ పథకానికి 5883 మంది రైతులు అర్హులుగా ఉన్నారని, దానిలో 4658 మంది రైతులు ఇప్పటివరకు ఈకేవైసీ చేసుకోగా మిగిలిన 1225 మంది రైతులు కూడా తప్పనిసరిగా చేసుకోవాలని, తద్వారానే రైతులు నగదు పొందగలుగుతారని తెలిపారు. ఈకేవైసీ రైతులు సులభంగా చేసుకోవచ్చునని, ఆధార్‌కి మొబైల్ లింక్‌లేని వాళ్లు దగ్గరలోని మీసేవా లేదా సీఎస్‌సీ కేంద్రాలలో బయోమెట్రిక్ ద్వారా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మెన్ తమ్మన్నగారి మధుసూదన్‌రెడ్డి, రైతుబంధు కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీలత, కావేరి, గణేష్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రేపు విద్యాశాఖ కమిషనరేట్ ఎదుట టిపిటిఎఫ్ ధర్నా

**కొల్చారం, డిసెంబర్1 ప్రభాతవార్త:** కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీల సమస్యలు పరిష్కరించాలని విద్యాశాఖ కమిషనర్‌కు పలుమార్లు విన్నవించినప్పటికీ వారి నుండి ఎలాంటి స్పందన రాలేదని, అందుకే టీపీటీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం మూడంచెల ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందని టీపీటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, వెంకట్‌రామ్‌రెడ్డిలు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మొదటి దశగా కేజీబీవీ పాఠశాలల ముందు భోజన విరామ సమయంలో నవంబర్ 15, 16వ తేదీలలో నిరసనలు చేశామని, రెండవ దశగా 26వ తేదీన జిల్లా కలెక్టరేట్ల ముందు నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయడం జరిగిందన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయినిల, బోధనేతర సిబ్బంది మౌలిక సమస్యలైన ఉద్యోగ భద్రత, కనీస వేతనం, రెగ్యులర్ ఉపాధ్యాయుల మాదిరిగా సెలవులు, ఖాళీల భర్తీ, విద్యార్థినులకు పౌష్టికాహారం, ట్రంక్ పెట్టెలు, దుప్పట్లు, ఇంటర్ చదివే వారికి యూనిఫారం సరఫరా, పాఠశాల వరకు సరకులు అందించడం తదితర డిమాండ్ల సాధన కోసం తప్పనిసరి పరిస్థితుల్లో డిసెంబర్ 3వ తేదీన పాఠశాల సంచాలకుల కార్యాలయం ముందు టీపీటీఎఫ్ నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కేజీబీవీ సిబ్బంది తమ డిమాండ్ల పరిష్కారం కోసం హైదరాబాద్‌కు తరలి రావాలని, ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.

### వినియోగదారులకు కావల్సిన అవసరాలను తీర్చనుంది

శామీర్‌పేట డిసెంబర్1, ప్రభాతవార్త : చలికాలం, క్రిస్మస్ సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో అమెజాన్ ఫ్రెష్‌పై సూపర్ వాల్యూ డేస్ సందర్భంగా డిసెంబర్7వ.తేది వరకు మీ కిరాణా సామాగ్రుల అవసరాలకు తీర్చుకోండి. కిరాణా, గృహావసర సామాగ్రులు, ప్యాకేజ్ చేసిన ఆహారపదార్థాలు తదితర వస్తువులను అమెజాన్ ఫ్రెష్లో షాపింగ్ చేయటం ద్వారా కస్టమర్లు 45శాతం తగ్గింపును పొందగలుగుతారు. తాము అభిమానించే ఆన్‌లైన్ షాపింగ్ డెస్టినేషన్ నుండి కొన్ని ఉత్కంఠభరితమైన ఆఫర్లతో కొత్త క్రిస్మస్ వంటలను తయారు చేసుకోండి, చలికాలాన్ని ఆస్వాదించండని వెల్లడించింది.

### తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష : శేఖర్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న శేఖర్‌రెడ్డి, జోగిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శారదా శంకర్, అలెగ్జాండర్‌లు

**యాచారం, డిసెంబర్ 1 ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష అని టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బిలకంటి శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో టిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పంది సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిఆర్ఎస్ పార్టీతోనే బడుగు బలహీనవర్గాల అభివృద్ధి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అ ందుబాటులో ఉన్నాయన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రామ సమగ్రాభివృద్ధికి సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎన్‌రెడ్డి ట్రస్టు చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మూడేడ్ల గోవర్ధన్‌రెడ్డి, ఎంపిటిసి శారద శంకర్, గోవర్ధన్‌రెడ్డి, అలెగ్జాండర్, రైతు సమన్వయ సమితి మండల చైర్మన్ కొంగల జైరెడ్డి, కొండాపురం శ్రీశైలం, జోగిరెడ్డి, మేకం శంకర్, సమ బాలరాజు, గౌర శేఖర్, గడాల నారాయణ, యంజాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చు: చైర్‌పర్సన్





రక్తధాన శిభిరాన్ని సందర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, కమీషనర్ వేమనరెడ్డి, సూపరింటెండెంట్ కోట్యానాయక్

**ఘట్‌కేసర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:**
ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా వారిని కాపాడవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలోని సెయింట్ అంథోనీస్ హై స్కూల్ ఆవరణలో గురువారం స్కూల్- మెల్విన్‌జిమ్ ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం నిర్వహించారు. ఘట్‌కేసర్ కమ్యూనిటీ ఆసుపత్రి రక్తనిధి ప్రతినిధులు దాతల నుంచి రక్తాని సేకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, కమీషనర్ పి.వేమనరెడ్డి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వి.కోట్యానాయక్‌లు విచ్చేసి రక్తధాన శిభిరాన్ని సందర్శించారు. ఈసందర్భంగా 34 మంది రక్తదానం చేయగా వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని వారు పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న యువత సంవత్సరానికి రెండుసార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ క్రిస్టనక్విల్డన్, రక్తనిధి ఇంచార్జ్ డాక్టర్ రమ్య, కౌన్సిలర్లు షేక్‌జహంగీర్, కుతాడి రవీందర్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు. వినూత్న, ఎంపిటిసి అంకిత రవి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### నడికూడ మల్లయ్య వర్ధంతి వేడుకలు



తెలంగాణ తొలిదశ ఉద్యమ కారుడు మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాలనీ వాసులు, కుటుంబ సభ్యులు.

**షాద్‌నగర్, డిసెంబర్ 1, (ప్రభాతవార్త) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలిదశ ఉద్యమంలో పాల్గొన్న రైతు నాయకుడు స్వర్గీయ నడికూడ మల్లయ్య 10వ వర్ధంతి వేడుకలను గురువారం షాద్‌నగర్ పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని రతన్‌కాలనీలో కాలనీ వాసులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక వార్డు కౌన్సిలర్ నడికూడ సరితాయాదగిరి యాదవ్, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్‌లు ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ ఉద్యమ తొలిదశ ఉద్యమకారుడు నడికూడ మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగించడం చాలా గొప్ప విషయమని వారి ఆశయాలను పునికిపుచ్చుకొని నిత్యం ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నడికూడ యాదగిరియాదవ్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. వారి తండ్రి వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్మికుడినికి నూతన వస్త్రాలను అందించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. అనంతరం కరాటే మాస్టర్ బాల్‌రాజ్ ముదిరాజ్‌కు డాక్టర్ చంద్రశేఖర్‌చేతుల మీదుగా రూ.3000లను కరాటే నిర్వహణ కోసం అందించడం జరిగిందని సీనియర్ నాయకుడు నడికూడ యాదగిరియాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు టీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు విప్పరి నరేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు టీఆర్ఎస్ నాయకుడు భిక్షపతిముదిరాజ్, ఆలయ కమిటీ కార్యదర్శి టీఆర్ఎస్ నాయకులు శ్రీశైలంగౌడ్, కాలనీ వాసులు శ్రీశైలంయాదవ్, రవికుమార్ యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, సత్యనారాయణయాదవ్, జితేందర్‌రెడ్డి, వరుణ్, నందు, సాయిలు, రాములు, సత్తయ్య, విమలమ్మ, సుక్కమ్మ, ఇంద్రమ్మ, కుమారి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

**ఘట్‌కేసర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:**
ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మేడ్చల్ జిల్లా బిజెపి ఎస్సీ మోర్చ అధ్యక్షులు కప్పర గళ్ల కరుణాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి మైసమ్మగుట్ట కాలనీ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ వసతిగృహాలను గురువారం బిజెపి దళితమోర్చ నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల గదులు, స్నానపు గదులు, వారికి అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా రని అధికారులు ఇక్కడ మరొక బోరు వేయించాలని వారు కోరారని తెలిపారు. హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో లేరని సరైన సౌకర్యాలు కల్పించాలని కరు ణాకర్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సగ్గు మోహన్‌రావు, ఘట్‌కేసర్ మండల అధ్యక్షులు సంకు మల్లేశం , ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు పడిగెం వీరేశ ం పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ ఎస్సీ వసతిగృహంలో సమస్యలు తెలుసుకుంటున్న బిజెపి ఎస్సీ మోర్చ నాయకులు

## అయ్యప్ప శరణుగోషతో....మారుమ్రోగుతున్న దేవాలయాలు

-అన్నదాన ప్రభు దంపతులకు సన్మానం



అన్నదాన ప్రభు దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు,స్వాములు

**నందిగామ డిసెంబర్1,ప్రభాతవార్త :** నందిగామ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అయ్యప్ప దేవాలయం ప్రాంగణం నిత్యం అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగుతుంది. అయ్యప్ప మాలాధారణ చేసిన స్వాములు భక్తి పాటలతో హోరెత్తిస్తూ, అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.అయ్యప్ప స్వాములతో ఈ దేవాలయం ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంది.బుధవారం అప్పరెడ్డి గూడ గ్రామానికి చెందిన మెకానిక్ ప్రభు-లావణ్య దంపతులు స్వాములకు అన్నదానం చేశారు.మహిమాన్వితమైన అయ్యప్ప అందరిని చల్లంగా చూడాలని వేడుకున్నారు.ఈ సందర్భంగా అన్నదాన ప్రభు దంపతులను ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు.ఈ వేడుకల్లో గురుస్వాములు వంకాయల రాంరెడ్డి,బి.సుదర్శన్ గౌడ్ ,చంద్రాపాల్ రెడ్డి,మేక్కొండ కుమార్ గౌడ్,ఎర్ర రవి కుమార్ గౌడ్,శివాగౌడ్,వడ్ల రమేష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

**తలకొండపల్లి డిసెంబర్1,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన చౌటి వెంకటమ్మ ఇటీవల మరణించడంతో గ్రామ వాలంటీర్ ద్వారా విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి,రాఘవేందర్ రెడ్డి, మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ 5వేల రూపాయలను ఆర్థిక సాయాన్ని ఐక్యత ఫౌండేషన్ ద్వారా భర్త చౌటి చెన్నయ్యకి అందజేశారు.ఈ కార్యక్రమంలో గౌరిపల్లి సర్పంచ్ అనురాధ నరేందర్ గౌడ్,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్,మ్యాకాభరత్ రెడ్డి,బొల్గాం శివ తుల్లా తిరుపతి,ఎండి గౌస్ సాయి రెడ్డి,కిరణ్ ,బూరుగుల రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం బిల్డింగ్ పనులు ప్రారంభం



చుక్కాపూర్‌లో యాదవ సంఘం బిల్డింగ్ పనులు పరిశీలిస్తున్న టిఆర్ఎస్ నాయకులు

**తలకొండపల్లి డిసెంబర్1,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామంలో గురువారం యాదవ సంఘం బిల్డింగ్ పనులు ప్రారంభించారు.యాదవ సంఘం బిల్డింగ్ నిర్మాణానికి కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నిధుల నుంచి ఐదు లక్షల రూపాయలు కేటాయించారు.ఈ నిధులతో స్లాబ్ పనులను ప్రారంభించారు.అమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో చుక్కాపూర్ గ్రామంలోని యాదవ సంఘం బిల్డింగ్ నిర్మాణానికి ఐదు లక్షల నిధులు మంజూరు చేశారు.ఈ సందర్భంగా గ్రామ టిఆర్ఎస్ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు.కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు కలుపుతూ ఎమ్మెల్యే రేవల్లె సహకారంతో పనులు పూర్తి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలం,మల్లారెడ్డి,యాదయ్య చెన్నై పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్స్ అసోషియేషన్ ఆర్థిక సహాయం



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫోటోగ్రాఫర్స్ అసోషియేషన్ సభ్యులు

**ఆమనగల్లు, డిసెంబర్01, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం రాఘాయిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ శెవ్వ మల్లేశ్ అకాల మరణం అతని కుటుంబంతోపాటు ఫోటోగ్రాఫర్స్ అసోషియేషన్‌కు తీరని లోటని ఆమనగల్లు మండల ఫోటోగ్రాఫర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు కాడిగే సత్యంనేత ఆవేదనతో అన్నారు. గురువారం ఆమనగల్లు ఫోటోగ్రాఫర్స్ అసోషియేషన్ తరపున బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం మృతుని కుటుంబానికి అసోషియేషన్ తరపున రూ. 25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దుద్దు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి జావేద్, గిరి, హలీమ్, కాలె శివ, నరసింహ్మా, కిషన్, ప్రశాంత్‌రెడ్డి, రాజు, తిరుపతయ్య, అశోక్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## తడి,పొడి చెత్త పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్గియుండాలి : చైర్మన్

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** తడి పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ ఎస్టీ కమ్యూనిటీ హాలులో గురువారం స్వచ్ఛ సర్వేక్షన్ 2023 కార్యక్రమంలో భాగంగా చెత్త నిర్వాహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ తమ ఇండ్లలో నుండి వెలువడే తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు హానికరమైన చెత్తను వేర్వేసి మున్సిపల్ చెత్త బండికి అందించాలని చైర్మన్ అన్నారు. తమ ఇంటితో పాటు తమ ఇంటి పరిసరా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ ఎ. సురేశ్, వనజ, లావణ్య, భాగ్యలక్ష్మి, శ్రీలత, పద్మ, సుజాత, పరిమళ, మున్సిపల్ సిబ్బంది శివారెడ్డి, అశోక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అన్నోజిగూడలో గురువారం జరిగిన స్వచ్ఛ సర్వేక్షన్ 2023 కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి

# రేపటి సమాజం కోసం భావోద్రేకాలపై నియంత్రణ కలిగి ఉండాలి



పట్టణ పురవీధుల్లో ఎయిడ్స్ పై ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ కళాశాల బృందం.



ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నర్సప్పగూడలో మానవహారం దృశ్యం

**షాద్‌నగర్ పట్టణంలో**

**షాద్‌నగర్, డిసెంబర్ 1, (ప్రభాతవార్త) :** రేపటి సమాజం బాగుండాలి అంటే ప్రతి ఒక్కరు భావోద్రేకాలపై నియంత్రణ కలిగి ఉండాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ ఎయిడ్స్‌దేను పురస్కరించుకొని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని దీర్ఘకాలిక, సీజనల్ అంటు వ్యాధుల పట్ల, వాటి సంక్రమణ పట్ల అవగాహన కలిగి ఉండి ఉన్నతమైన జీవనం గడపాలని వీటిని ఇతరులకు కూడా తెలియజేయవలసిన బాధ్యత డిగ్రీ స్థాయి విద్యార్థులకు ఉంది అన్నారు. అదేవిధంగా ప్రిన్సిపల్ భానుప్రకాష్ మాట్లాడుతూ... ఎయిడ్స్ కేవలం అసురక్షిత కలయిక వల్లనే కాకుండా బ్లెడ్స్, సిరాంజీలు లాంటి వాటి వల్ల సంక్రమించే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్‌కుమార్, శ్రీలత, పాల్గున, శ్రీనివాస్, గౌరమ్మ, అనురాధ, సుభాష్, కళాశాల విద్యార్థులు, భోదనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నందిగామ మండలంలో**

**నందిగామ డిసెంబర్1,ప్రభాతవార్త :** నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ముచ్చింతల్ జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళశాల,జాతీయ సేవ పథకం వారి సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఉన్నపాఠశాల నుండి గ్రామంలోని వీధులు తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు.ఈ అవగాహన కార్యక్రమంలో జిమ్స్ హోమిపతిక్ మెడికల్ కళశాల విద్యార్థులు,అంగన్‌వాడీ ఉపాధ్యాయులు శోభారాణి,సువర్ణ,లక్ష్మి,పాఠశాల ఉపాధ్యాయులు డ్వాక్రా మహిళలు,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పరిపాలనకు పక్క రాష్ట్రాల అభినందనలు : ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



చౌదరిగూడలో కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 01,(ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనను చూసి పక్క రాష్ట్రాలు అభినందినలు తెలుపుతున్నాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్య సమాజ్ భవనంలో కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 35మందికి కళ్యాణ లక్ష్మీ చెక్కులు మంజురు అయినట్లు అధికారులు తెలిపారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగ హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు మంజురు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో రైతుభీమా, రైతుబంధు, కేసీఆర్ కిట్టు, కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్, ఇంటింటికి తాగు నీరు, పింఛన్లు, 24గంటల విద్యుత్ సరఫర తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు. పేద విద్యార్థుల కోసం నూతన గురుకుల పాఠశాలలను ప్రారంబించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న ఒక్కో విద్యార్థికి సంవత్సరంలో లక్షా 25వేల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేస్తుందని అన్నారు. గ్రామాల్లోని మహిళలకు ఇబ్బందులు ఎదురవ్వకుండ ఇంటింటికి నీటి సదుపాయం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని పెర్కొన్నారు. గతంలో ఎప్పుడు లేని విదంగా తెలంగాణలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ఓ మహిళ అడిగిన ప్రశ్నకు సమాదానం ఇచ్చారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అనేక పరిశ్రమలను తెలంగాణలో నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. నూతన పరిశ్రమలలో తెలంగాణ వారికి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు కేంద్రం ఒక్క ఉద్యోగం కూడ కల్పించలేదని ఆయన అన్నారు. అధిక ధరలు కేంద్రం పెంచుతున్న చమురు ధరలపై ఆధారపడి ఉంటుందని ఆయన పెర్కోన్నారు. కేంద్రం రాష్ట్రానికి చేసిందేమి లేదని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, జడ్పిటీసీ బంగారు స్వరూప, తహసీల్దారు విజయ్‌కుమార్, ఎంపీడీఓ మహేష్‌బాబు,పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షులు హాఫీజ్, శ్రీధర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో భారీగా చేరిన యువకులు



**బషీరాబాద్,డిసెంబరు 01,ప్రభాతవార్త:** బిజెపి నాయకులు పేర్కొన్న విధంగా పార్టీలో చేరికలను మొదలుపెట్టారు. బషీరాబాద్ మండల పరిధిలోని జీవన్గి గ్రామానికి చెందిన 40మంది యువకులు గురువారం నాడు నరేష్ మల్కోడ్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్, వికారాబాద్ జిల్లా మాజీ గ్రథాలయ చైర్మన్ మురళీకృష్ణ,తాండూర్ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్ తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ బిజెపి పార్టీలో చేరటం అంటే రాజకీయం కాదని బిజెపిలో చేరాలంటే పూర్వజన్మ పుణ్యమే అన్నారు.పార్టీలో చేరిన 40మంది యువకులను తమ గ్రామం నుండి 400 మందిని బిజెపి పార్టీలో చేర్పించేలా చూడాలన్నారు.ఈ సందర్భంగా మాజీ గ్రాథాలయ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సోంత మండలం నుండి పార్టీలో చేరికలు మొదలు పెట్టడం చాలా సంతోషంగా ఉదన్నారు.దళిత బంధు పేరుతో తెరాస పార్టీ దళితులను వంచిస్తుందన్నారు.తాండూర్ నియోజకవర్గానికి 70కి పైగా దళిత బంధు మంజూరు అయితే ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి.కేవలం తన ఇందార్చెడ్ గ్రామానాకి మాత్రమే 14 కేటాయించారని అన్నారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీలో చేరిన యువకులను మీ గ్రామంలో ఎంత మందికి దళిత బంధు వచ్చిందని ప్రశ్నించారు.నరేష్ మహరాజ్ మాట్లాడుతూ తాండూర్ నియోజక వర్గంలో ఏ కార్యం మొదలు పెట్టిన అది జీవన్గి నుండి ఆరంభించటంతో విజయవంతం అవుతుందని ఆయన పేర్కొన్నారు.బిజెపి పార్టీలో చేరిన యువకులకు బిఆర్ఎస్ పార్టీ పేరును భ్రష్టచర్ రాష్ట్రీయ సమితి,బార్ అండ్ రెస్టారెంట్ సమితి అని అన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో అంతా అవినీతి పాలన కొనసాగుతుందన్నారు.రాబోయే రోజుల్లో తాండూర్‌లో బిజెపి ఎమ్మెల్యే గెలుపు ఖాయం అన్నారు.బిజెపి పార్టీలో చేరేందుకు గ్రామాలల్లో యువకులు ఆశక్తి చూపుతున్నారని తెలిపారు. మూడు నెలల్లో బషీరాబాద్ మండలం వ్యాప్తంగా వంద శాతం చేరికలు జరుగుతాయని అన్నారు.ఈ కార్యక్రమం అనంతరం యువకులు నరేష్ మహరాజ్‌తో కలిసి మాట్లాడుతూ తమ గ్రామంలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.శివాజీ విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తే తమ గ్రామం నుండి మరింత మంది యువకులు బిజెపిలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ మండల అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు మహేష్,యువమోర్చా అధ్యక్షుడు ప్రశాంత్,తాండూర్ బిజెవైయం అసెంబ్లీ కన్వీనర్ అభిలాష్ పండిత్,బిజెవైయం జిల్లా కోశాదికారి గోవింద్ అసావా,జిల్లా కార్యవర్గ సభ్యులు రాజ్ కుమార్ కులకర్ణి,పార్టీలో చేరిన యువకులు నవీన్,శ్రీనివాస్, రాజు,శ్రీనివాస్,రవి,శరణప్ప ఉన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేస్తున్న జడ్పీచైర్‌పర్సన్

**శంకర్‌పల్లి, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రంగారెడ్డి జిల్లా జడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిల ప్రభుత్వ పాఠశాలలో గురువారం రంగారెడ్డి జిల్లా జడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థుల కొరకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సుమిత్రమోహన్‌రెడ్డి ఉన్నారు.

**శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

**శంకర్‌పల్లి, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలో ప్రేరణ అవగాహనను శిక్షణ ఫౌండేషన్ నిర్వాహకులు జిల్లా మేనేజర్ నాగరాజు, మండల మెంటర్ కె.రవి ఎఫ్.ఎల్.ఎన్ ప్రేరణ అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చడం కోసం స్టార్స్, ప్రాక్టీస్ వర్క్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎంఈవో సయ్యద్ అక్బర్, టీఎస్ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

**ఘనంగా సాయిబాబా దేవాలయం 11వ వార్షికోత్సవం**

**శంకర్‌పల్లి, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర కాలనీలో గల సాయిబాబా ఆలయ సాయి సేవా సమితి సభ్యులు గురువారం ఘనంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.పెద్ద ఎత్తున్న భక్తులు హాజరయ్యారు. సాయినామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో భక్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.



సాయిబాబా దేవాలయం 11వ వార్షికోత్సవం

**పిఎం కిసాన్ సమ్మన్ నిధిపై రైతులకు అవగాహన సదస్సు**

**మొయినాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్ గ్రామ సర్పంచ్ సంధ్యారాణి శ్రీశైలం సమక్షంలో పీఎం, కిసాన్ సమ్మన్ నిధి కోరకు రైతులు ఈకెవైసీని చేయించుకోవాలని రైతులకు మండల వ్యవసాయ అధికారిణి రాగమ్మ ఆధ్వర్యంలో అవగాహన కల్పించడం జరిగింది, ఇప్పటికే ఈకెవైసీ చేయించుకోని రైతుల మొయినాబాద్ మండలంలో మొత్తం 1965 మంది ఉన్నారని తెలిపారు. కావున రైతులందరు ఈకెవైఈని తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు. లేకుంటే పిఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాలో జమకావని వ్యవసాయ అధికారి రాగమ్మ రైతులతో మాట్లాడి తెలిపారు, ఈ కార్యక్రమంలో గ్రామ కోఆర్డినేటర్ కొండల్ రెడ్డి, ఎఈవో కుమార్, మరియు గ్రామ రైతులు తధితరులు పాల్గొన్నారు,

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

-ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

**కుల్కచర్ల డిసెంబర్ 1,ప్రభాతవార్త :** రైతులు మహిళా సంఘం(ఐకేపి) ద్వార ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి,డిసిసిబి చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు.గురువారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిదిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో సెర్ప్ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు కాబడుతున్న వరిదాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని దళారులను నమ్మి మోసపోకుండా రైతులకు లబ్ది చేకూర్చే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మాలని,ధాన్యాన్ని బాగా ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తద్వార ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని వారు రైతులకు సూచించారు.రైతులకు రైతుభీమా మరియు రైతుబంధు అందజేస్తూ రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తోకుంటుందని వారు అన్నారు.ప్రభుత్వం రైతు పండించిన వరిని క్వింటాలుకు రూపాయలు 2060 (ఏ గ్రైడ్),2040 (బి గ్రేడ్) మద్దతు ధరకు కొంటుందని అందరికి వెసులుబాటుగా ప్రతి ఊరిలోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కేబి రాజు.ఎంపిపి సత్య హరిశ్చంద్ర,జడ్పిటిసి రాందాస్ నాయక్, ఏపిఎం శోభ,టిఆర్ఎస్ పార్టి కుల్కచర్ల మండల అద్యక్షుడు శేరి రాంరెడ్డి మరియు ముఖ్య నాయకులు,గ్రామ సంఘం అధ్యక్షులు, మహిళా సంఘాల సబ్యులు,రైతులు,సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

## కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ జన్మదిన వేడుకలు

-శైలజమధు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు



**నాగారం డిసెంబర్1,ప్రభాతవార్త :** అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజానాయకురాలు మనసున్న మహారాణి నాగారం మున్సిపల్ 7వ.వార్డు కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.గూడూరు సబిత గౌడ్ తన జీవత యాత్రలో 45 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకొని 46వ.సంవత్సరంలో అడుగుపెట్టిన శుభ సందర్భంగా పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.గురువారం బ్రహ్మయ్య కాలనీ గుండు శైలజమధు గౌడ్ ఆధ్వర్యంలో గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్చములు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పలువురు ఆత్మీయ అభిమానులు కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రావు,వాసవి,జైపాల్ రెడ్డి,పావని,ఆనందరాజు సుజాత,రమణ నాగరత్నం,యాదగిరి నవీన్,విజయభాస్కర్,నవీన్ బాలి కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కిష్టన్నకు నివాళులు

**తలకొండపల్లి డిసెంబర్1,ప్రభాతవార్త :** తెలంగాణ మలిదశ ఉద్యమకారులు పోలీస్ కిష్టన్న ముదిరాజ్ వర్ధంతి కార్యక్రమాలు తలకొండపల్లి మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరుడై ఉద్యమాన్ని ఉద్రిక్తం చేసిన పోలీస్ కిష్టన్న ముదిరాజ్ ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీనివాస్,బోళ్ల యాదగిరి,బోల్ల శ్రీనివాస్ పద్మ,నరేష్,ఈసారి శ్రీకాంత్ ,ఉప్పనమోని శంకర్,నరసింహ, శంకరయ్య,శ్రీనివాస్ పద్మ,గణేష్ వెంకటేష్,రమేష్,శివ వికాస్,పాల్గొన్నారు.

## వరి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



**తలకొండపల్లి డిసెంబర్1,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన దేశం శ్రీధర్ రెడ్డి వరి పొలాన్ని పరిశీలించి పాస్వరం కరిగించే బ్యాక్టీరియా వాడకము,వరిలో వెదజల్లు పద్ధతి,క్షేత్రదినోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి గీతా రెడ్డి,మండల వ్యవసాయ అధికారి రాజు,వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనాథ్, పిఏసిఎస్ డైరెక్టర్ వెంకటరెడ్డి,రైతుబంధు,కో ఆర్డినేటర్ మల్లారెడ్డి,పాండు మాజీ ఎంపిటిసి యాదయ్య,గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 6వ తేదీ నుండి కుష్టువ్యాధి గుర్తింపు సర్వే



**మొయినాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలోని చిల్కూర్ రెవెన్యూల్లో గల దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా నైపుణ్య అభివృద్ది సంస్థలో వివిధ రకాల వ్యాధులకు సంబంధించి అవగాహన సదస్సును నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా జిల్లా వెద్యాధికారి డా.దామోదర్ హజరయ్యారు, ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గ బహుళార్ధ సాధక ఆరోగ్య కార్యకర్తలందరికి కాంప్రమెన్సీ హెల్త్ కేర్ సీపిఎచ్‌సీ దీర్ఘకాలిక జబ్బులు ఉపశమన మార్గాలు, వయోవృద్దుల వ్యాధులు, తీసురోవాల్సిన జాగ్రతలు మరియు క్యాన్సర్ ఇతరాత్ర వ్యాధుల గురించి ఉపశమన మార్గాలు వయోవృద్దులు వ్యాధులకు గురించి ఉపశమన మార్గాల గురించి వివరించడం జరిగింది, పాలేటీవ్ సెంటర్‌లలో దీర్ఘకాలీక జబ్బుల వారిని గుర్తించే విధానం మరియు ఇతర ఉపకారణాల మీద ముగింపు కార్యాక్రమం నిర్వహించారు, ఇదే సందర్బంగా ఈ నెల ఆరో తేది నుండి 15 రోజుల పాటు జరిగే కుష్టువ్యాధి గుర్తింపు సర్వే మరియు చికిత్స విధానం, టిబి, వ్యాది గ్రస్తుల గుర్తింపు, సర్వే చికిత్స విధానం మరియు వచ్చేనెలల్లో కంటి వెలుగు కార్యాక్రమం గురించి డివిజన్‌లోని అందరికి కూడ శిక్షణ ఇచ్చారు, అలాగే 2వ తేది నుండి డివిజన్‌లోని 6 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వారి పరిధిలో అక్కడ ఆశావర్కర్లకు శిక్షణ ఇవ్వాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో డిజిజన్ ఉప జిల్లా వైద్యాదికారి డా.దామోదర్, చెంద్రశేఖర్ ఆజాద్, డిపిఎమ్‌వో లక్ష్మి, డిపిఎమ్‌వో సునీతా, ఉమామహేశ్వరి, సుపర్‌వైజర్లు హజరయ్యారు,

## సమస్యల పరిష్కారానికే శుభోదయం



వృద్దుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

**షాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** గ్రామాల్లో ప్రజాసమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారానికే శుభోదయం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, లింగారెడ్డిగూడ గ్రామాల్లో పర్యటించి, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు చేయడంతో, బంగారు తెలంగాణగా మార్చడంలో సీఎం కేసీఆర్ కీలక పాత్ర పోషించదన్నారు. నిరుపేదల అభ్యున్నతికి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన ఘతన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా పథకాలు, ఆసరా పెన్షన్లు ఇస్తు నిరుపేదలకు అండగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ అన్నారు. నేడు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో జడ్పిటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ రావు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో అనురాధ, ఎంపీవో హన్మంత్‌రెడ్డి, డీఈ, ఏఈలు శ్రీదివ్య, నరేందర్, శారద, ఏవో వెంకటేశం, సర్పంచ్ పూజితశ్రీనివాస్‌గౌడ్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడిగా హరీష్‌రావు**

**షాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** వ్యవసాయ కార్మిక సంఘం 11వ రంగారెడ్డి జిల్లా మమాసభలో షాబాద్ మండలం ఏట్లఎర్రవల్లి గ్రామానికి చెందిన హరీష్ రావును జిల్లా కమిటీ సభ్యునిగా ఎంపిక చేసినందుకు వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకంలో జిల్లా కమిటీలో స్థానం కల్పించిన జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలుపుతూ వ్యవసాయ కార్మికులు ఎదు ర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తానని షాబాద్ మండలంలో అన్ని గ్రామాల్లో కమిటీలు వేసి వ్యవసాయ కార్మిక సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.